ప్రైవేటుకు ఇవ్వొద్దు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరమైతే మెడికల్ సీట్లు ఎక్కువగా మేనేజ్‌మెంట్ కోటాలో చేరతాయి. దీని వల్ల పేదలకు, మెరిట్ విద్యార్థులకు వైద్య విద్య భారంగా మారుతుంది. ప్రైవేటీకరణ చేస్తే ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వ కాలేజీలు అయితే పెద్దగా ఉంటాయి. రోగులు ఎక్కువ మంది వస్తారు. విద్యను బాగా చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రైవేటులో దీనికి భిన్నంగా పరిస్థితి ఉంటుంది. ప్రైవేటు వారు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తారు. మేనేజ్మెంట్ కోటాలో వారు ఎంత చెబితే సీటుకు అంత చెల్లించాల్సి వస్తుంది. దీంతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావాల్సి వస్తుంది. మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి.

– పి.శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శి



విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు



ఈ ఏడాది ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభించి ఉంటే వైద్య విద్యార్థులకు 150 సీట్లు దక్కేవి. పేదలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందేవి. ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అదే నిజమైతే... వైద్య విద్య డబ్బున్న వారిదే అవుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎలాగైనా డాక్టర్ చేయాలని స్తోమతకు మించి అప్పులు చేసి మరీ చదివిస్తున్నారు. ఈ ఏడాది మెడికల్ కాలేజీలు ప్రారంభమై ఉంటే కొందరికైనా అవకాశాలు వచ్చి ఉండేవి. కాలేజీలను ప్రారంభించకుండా కూటమి ప్రభుత్వం వైద్య విద్యార్థుల ఆశలపై నీళ్ల చల్లింది.

– సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

ఆటో కార్మికులు ఐకమత్యంతో మెలగాలి

కేవీపల్లె : ఆటో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి ఐకమత్యంతో మెలగాలని ఏఐటీయూసీ నాయకులు ఊటుపల్లె శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్రేవారిపల్లె క్రాస్‌లో ఆటో కార్మికులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కారిక్మకులకు ఉన్న సంక్షేమ పథకాలు, భీమా పథకాలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు రఫీ, ఆంజినేయులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ములకలచెరువు : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ పోలప్ప శుక్రవారం పోస్టర్లు ఆవిష్కరించారు. నులి పురుగుల నివారణ మాత్రల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ ప్రజల్లో అవగాహన కల్పించాలని డాక్టర్ జాహ్నవిరెడ్డి సూచించారు.

రసవత్తరంగా ఆటల పోటీలు

కేవీపల్లె : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా మండలస్థాయి ఆటల పోటీలు రసవత్తరంగా నిర్వహించారు. మొదటి రోజు వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. శుక్రవారం రెండో రోజు చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల 3వ వారంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రాహ్మజీ, కోఆర్డినేటర్ పురుషోత్తం పాల్గొన్నారు.

వాల్మీకిపురం ఎస్ఐగా చంద్రశేఖర్

వాల్మీకిపురం : వాల్మీకిపురం ఎస్ఐగా చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న నాగేశ్వరరావు అన్నమయ్యకు బదిలీ అయ్యారు. రామసముద్రం నుంచి బదిలీపై ఎస్ఐ చంద్రశేఖర్ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చూస్తామన్నారు. కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పరిశుభ్రత పాటించాలి

కలికిరి : విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని హెచ్ఈ మహ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ముజీబ్ బాషా అన్నారు. కలికిరి పరిధిలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు సీజనల్ జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరాలు వచ్చిన వెంటనే ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యక్తి గత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. నివాసాల పరిసరాల్లో కాలువల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, చెత్త దిబ్బలు ఊరికి దూరంగా వేయాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడటం, సాయంత్రం ఇంట్లో వేపాకు పొగ వేయడం వంటివి చేయాలన్నారు. పెద్దలకు ఆరోగ్య నియమాలు, పరిశుభ్రతపై తెలియజేయాలని సూచించారు.

స్టేషన్ రికార్డుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం : స్థానిక పోలీస్ స్టేషన్‌ను ములకలచెరువు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజారమేష్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలో శాంతి భద్రతలు, అసాంఘిక కార్యా కలాపాలు, రౌడీ షీటర్ల వివరాలు, నమోదైన కేసులు, పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ నరసింహుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లోని సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మమేకమై సామరస్యంగా వారి సమస్యను పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు.

వైభవంగా వెంకన్న పవిత్రోత్సవాలు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మూడు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామికి పవిత్రోత్సవాలు కనువిందుగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు, ఉప ప్రధాన అర్చకులు క్రిష్ణప్రసాద్‌భట్టార్ ,ఆలయ అర్చకులు రమేష్‌చార్యులు సంప్రదాయబద్ధంగా ఆగమశాస్త్రం మేరకు యాగశాల, పూర్ణాహుతి, స్వప్న తిరుమంజనం భక్తులకు కనువిందు కలిగేలా నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి,ఇన్స్‌పెక్టర్ దుషంత్‌కుమార్, నగేష్, రవి పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రెడ్డెప్ప రెడ్డి మాట్లాడుతూ హిందీ దేశ భాష అని, హిందీ చదవటం మన బాధ్యత అన్నారు. హిందీ నేర్చుకోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ఆర్మీ, పోస్టల్, రైల్వే శాఖల పోటీ పరీక్షల్లో రాణించడానికి అవకాశం ఉందన్నారు. పాఠశాలలో హిందీ పండితుల చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ప్రతిభకు ప్రోత్సాహం



ఎన్ఎంఎంఎస్‌కు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు



స్టడీ మెటీరియల్‌లతో ఎన్ఎంఎంఎస్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు

- ఎన్ఎంఎంఎస్‌కు ఉచిత శిక్షణ
- ఏటా ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు



2023–24	25 మంది
2022–23	51 మంది
2021–22	22 మంది

మదనపల్లె సిటీ : ఆర్థికంగా వెనుబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను ప్రవేశపెట్టింది. ఈ స్కాలర్‌షిప్‌కు 2024–25 విద్యా సంవత్సరాని దరఖాస్తులకు ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల ప్రక్రియ ఆగస్టు 5వతేదీన ప్రారంభం కాగా ఈనెల 17వతేదీ వరకు అవకాశాన్ని పొడిగించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, ఎయిడెడ్ , మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల్లోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులను సమర్పించాల్సి ఉంది.

విద్యార్థులకు ఉచిత శిక్షణ:

మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని రాంరెడ్డి లేఅవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రతి ఏడాది ఎన్ఎంఎంఎస్ ప్రవేశపరీక్షకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 1వతేదీ నుంచి పాఠశాలలో ఉదయం 8 నుంచి 9 వరకు శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేంగా చొరవ తీసుకున్ని శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు కావాల్సిన స్టడీ మెటీరియల్‌కు కూడా ఉచితంగా అందిస్తున్నారు. గత పది సంవత్సరాల నుంచి శిక్షణ ఇస్తున్నారు.

మున్సిపల్ పాఠశాలలో అధికంగా ఎంపికవుతున్న పాఠశాల:

రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలల్లో మదనపల్లె రాంరెడ్డిలేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అధికంగా ఎంపికవుతున్నారు. మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు, ప్రఖ్యాతులు గడిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా ఉపకారవేతనాలను పొందడానికి మంచి అవకాశం. 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షలో ప్రతిభ చాటితే నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు. చదువుకు ఆటంకం కల్గించే ఆర్థికపరమైన ఇబ్బందుల్లో ఈ ఉపకారవేతనం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – రాజేంద్రప్రసాద్, హెచ్ఎం

ప్రోత్సాహం కల్పిస్తున్నాం



ఉపాధ్యాయులందరూ కలిసి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ఆయా సబ్జెక్టులపై స్టడీ అవర్స్ నిర్వహించి సాధన చేయిస్తాం. దాత సహకారంతో స్టడీ మెటీరియల్ కూడా అందిస్తున్నాం. ప్రతి ఏడాది పాఠశాల నుంచి 25 నుంచి 30 వరకు ఎంపికవుతున్నారు. – పురం వెంకటరమణ, ఉపాధ్యాయుడు

ఏచూరి మరణం తీరనిలోటు

- సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు
- మదనపల్లి కమిటీ ఆధ్వర్యంలో సంతాపం సభ



సీతారాం ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గొప్ప మేధావి అని జిల్లా సీపీఎం కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికే కాకుండా దేశానికే తీరని లోటు అని అన్నారు. సీపీఎం మదనపల్లి కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఏచూరి మృతికి సంతాపాన్ని ప్రకటిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ సమస్యలపై అనర్గళంగా మాట్లాడే వ్యక్తి ఏచూరి అని అన్నారు. దేశంలో ఉన్న మతోన్మాద ప్రభుత్వం నానాటికి మీతిమిరిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను ఏకం చేసే ప్రయత్నం సీపీఎం చేస్తోందని చెప్పారు. ఈ కర్తవ్యాన్ని నిర్వహించగల వ్యక్తి ఏచూరి అని చెప్పారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆయన సేవలు చాలా అవసరమని తెలిపారు. ఇలాంటి సమయంలో ఆయన మృతి పార్టీకి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని చెప్పారు. పార్టీ కార్యకర్తల పట్ల ప్రేమ, అప్యాయతతో ఉండేవారని చెప్పారు. తన జీవితాన్ని పార్టీకి అంకితం చేశారని అన్నారు. ఏచూరి అడుగు జాడల్లో నడుస్తూ బలమైన వామపక్ష ఉద్యమాన్ని నిర్మించాలని అదే ఏచూరికి ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు హరిశర్మ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి ఏచూరి దూరం కావడం చాలా బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర, రెడ్డిప్రసాద్, ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్కూల్ గేమ్స్ పోటీలు



అండర్-14 (బాలురు) లాంగ్ జంప్ విజేతలు



అండర్-17 డిస్కత్రో విజేతలు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండల స్కూల్ గేమ్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్‌కు అర్హత సాధించినట్లు స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ శివశంకర్ తెలిపారు. విజేతల వివరాలను ప్రకటించారు. అండర్-17 డిస్కత్రోలో మొదటి స్థానం గణేష్, జెడ్పీహెచ్ఎస్, సీటీఎం, లిఖిత్,ద్వితీయ స్థానం, వశిష్ట స్కూల్, అండర్-17 మొదటి స్థానం బి.ప్రశాంత్, ద్వితీయ స్థానం లిఖిత్‌రెడ్డి, బాలికల విభాగంలో వైష్ణవి, తేజస్విని, అండర్-14 బాలికల డిస్కత్రోలో దీక్షిత, మొదటి స్థానం, ఫ్రీపుల్ స్కూల్, శైలశ్రీ, ద్వితీయస్థానం,బాలుర విభాగంలో మొదటి స్థానం నిరూప్,దీక్ష స్కూల్, గణవర్ధన్ ద్వితీయ స్థానం సాధించారు. అండర్-17 100 మీటర్ల బాలుర మొదటి స్థానం ప్రశాంత్, వేద స్కూల్, లిఖిత్‌రెడ్డి వశిష్ట స్కూలు, అండర్ -14 బాలికల విభాగంలో మొదటి స్థానం వైష్ణవి, దీక్ష, ద్వితీయ స్థానం అర్షియ సాధించారు. కార్యక్రమంలో పీడీలు నాగరాజ, నరేష్, దేవకమ్మ, సుధాకర్, జలజ, శరత్, అంజనప్ప, మహేంద్ర, మహేష్, జోహర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ

కేవీపల్లె : మండల పరిధిలోని కేవీపల్లి మోడల్ పాఠశాలలో విద్యార్థినులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితరాలపై వివరించడంతో పాటు పౌష్టికాహారం ప్రాముఖ్యతను తెలిపారు. అలాగే ఆపద పరిస్థితులల్లో ఉపయోగించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 112, 181 లను తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతను వివరించారు. కార్యక్రమంలో మహిళ పోలీసులు రెడ్డెమ్మ, శివకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం మళ్లీ వాయిదా

కలికిరి : మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా ఉదయం 11.30 గంటలకు ఎంపీటీసీ సభ్యులు హాజరవ్వలేదు. ఎంపీపీతో పాటు మహల్ ఎంపీటీసీ సభ్యురాలు సావిత్రి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వాన్, అధికారులు హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూడగా మిగిలిన ఎంపీటీసీ సభ్యులు హాజరుకాక పోవడంతో కోరం లేక ఎంపీపీ ఆదేశాల మేరకు ఎజెండాపై ఎటువంటి చర్చ లేకుండానే ఎంపీడీఓ గంగయ్య సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి సమావేశం తేదీని తెలియచేస్తామన్నారు.

పోలీసుల వైఫల్యంతోనే

దళితులపై దాడులు

బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులుడు బందెల గౌతమ్‌కుమార్



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె : నియోజకవర్గంలో దళితులపై వరుసగా దాడులు జరుగుతూనే ఉన్నప్పటికీ, వాటిని అరికట్టడంలో పోలీసులు పూర్తిగా విఫలం చెందారని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న చీకలబైలుకు చెందిన నారాయణను పరామర్శించారు. ఈ సందర్భంగా బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ...చీకలబైలు గ్రామంలో మూడురోజుల క్రితం నారాయణపై దాడిచేసి తలపగులగొట్టి ఏడుకుట్లు పడినప్పటికీ, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదులో నిర్లక్ష్యం కనపరిచి ఎట్టకేలకు నిన్నరాత్రి చేశారన్నారు. నారాయణపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో గత 20 రోజుల్లో...రామసముద్రం మండలంలోని యంబాడి, ఆర్. నడింపల్లె, మదనపల్లె మండలంలోని పనసమాకుల పల్లె, చీకలబైలులో దళితులపై వరుసగా దాడులు జరిగాయన్నారు. ఆయా ఘటనల్లో నిర్దేశిత సమయంలో ఎఫ్ఐఆర్‌లు కట్టకపోవడం, అరెస్ట్‌లు చేయకపోవడంతో దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. దళితులపై వరుసదాడులు జరుగుతున్నప్పటికీ డీఎస్పీ కొండయ్యానాయుడు పట్టించుకోవడం లేదన్నారు. కూటమిప్రభుత్వంలో దళితులపై దాడికి పాల్పడ్డ వ్యక్తులకు మంత్రులు అండగా నిలుస్తున్నారన్నారు. నియోజకవర్గంలో వరుసగా నాలుగు సంఘటనలు జరిగినప్పటికీ, ఇప్పటివరకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బాధితులను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. దళితులపై వరుసగా జరుగుతున్న దాడులను పోలీసులు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బంది నిరసన

మదనపల్లె : ప్రభుత్వం ఇటీవల జారీచేసిన జీఓ 115ను రద్దుచేసి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందికి న్యాయం చేయాలని కోరుతూ మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి అత్యవసర విభాగం ఎదుట ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది మోకాలిపై కూర్చుని ఆందోళన చేశారు. ఈజీఓ కారణంగా తాము 14 ఏళ్లపాటు అందించిన సేవలకు విలువ లేకుండా పోయిందన్నారు. వెంటనే ప్రభుత్వం నర్సింగ్ సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసి తమకు ప్రాధాన్యత కల్పించాలన్నారు.

నేడు విద్యుత్ ఓసీ ఉద్యోగుల సమావేశం

మదనపల్లె : చిత్తూరు బాస్‌హోటల్‌లో శనివారం నిర్వహించనున్న విద్యుత్ ఓసీ ఉద్యోగుల కార్యనిర్వాహక సమావేశం విజయవంతం చేయాలని మదనపల్లె డివిజన్ ఓసీ సంఘ నాయకులు జి.రామలింగారెడ్డి, శేషాద్రి నాగరాజులు కోరారు. శుక్రవారం మదనపల్లె డివిజన్ విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసింది. చిత్తూరులో జరిగే కార్యనిర్వాహక సమావేశంలో రాష్ట్ర సదస్సుతో పాటుగా రాష్ట్ర ఎన్నికలు జరుగుతాయన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



కలకడ : తోటిపల్లెలో నిమజ్జనానికి తీసుకెళుతున్న గణేష్ విగ్రహం

కలకడ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అనేక గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. చాందినీబండిపై గ్రామ పురవీధులలో ఊరేగించారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యువత, వృద్ధులు, మహిళలు కోలాహలంగా ఆయా గ్రామాల పరిధిలోని నీటకుంటలలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో ప్రతిష్టించిన వినాయక విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్థానిక పోకనాటివీధిలో విగ్రహం ప్రతిష్ఠించిన కోదండ రామస్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం నుంచి గురువారం రాత్రి వరకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం విగ్రహ నిమజ్జన కార్యక్రమం వేడుకగా జరిపారు. పట్టణంలో ప్రదర్శన అనంతరం అచ్చమ్మకునుమలోని చెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పోలీసులు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు



స్కూల్ గేమ్స్ పోటీలల్లో పాల్గొన్న క్రీడాకారులు

వాల్మీకిపురం : మండలంలోని కొత్తమంచూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ 14, అండర్ 17 బాలబాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చదరంగం, షటిల్, యోగా పోటీలలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ ఆటలో ఫైనల్స్‌లో చింతపర్తి – కొత్తమంచూరు మ్యాచ్ నందు కొత్తమంచూరు అండర్ 17 విభాగంలో విజేతగా నిలిచింది. కార్యక్రమంలో హెచ్ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి



వాల్మీకిపురంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కలికిరి : అన్నదానం చేస్తున్న నల్లారి తిమ్మారెడ్డి తదితరులు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే చింతల జన్మదిన వేడుకలు

వాల్మీకిపురం : సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం స్థానిక శ్రీ షిర్డీసాయి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి, నిండునూరేళ్లు మాజీ ఎమ్మెల్యే చింతల ఆరోగ్యంతో నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించాలని కొనియాడారు. అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ కలీం, శ్రీధర్‌రాయల్, చికెన్‌మస్తాన్, లక్ష్మన్న, ఇబ్రహీం, ముని భాస్కర్, కుమార్, సైఫుల్లా, పులిబ్రదర్స్, చంద్రశేఖర్, శివారెడ్డి, రవీంద్ర రెడ్డి, మోహన, రాజాబాబు, శ్రీనివాసులు శెట్టి, చంద్రశేఖర్, రవి, రాజేష్, మదనమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి : పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదినాన్ని కలికిరిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక తిమ్మారెడ్డి మిషన్ కాంపౌండ్ ఆవరణలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సావిత్రి, నాయకులు రత్నశేఖర్‌రెడ్డి, ఎస్టీడి హరి, అద్దవారిపల్లి సర్పంచ్ గంగయ్య, ప్రదీప్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వాన్, వెంకటపతి, ప్రభాకరయ్య, ద్వారకనాథరెడ్డి, వీరభద్రయ్య, సైదు, రఘు, మధు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని నవాబుకోట పంచాయతీ పెద్దపొంగుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు.గర్భిణులు, బాలింతల ఆహార నియమాలు, ప్రభుత్వం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయంలో శుక్రవారం సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో పార్వతీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి పంచామృతాభిషేకం , అష్టోత్తర దేవీ ఖడ్గమాల శోత్రం, లలిత సహస్రనామం, కుంకుమార్చన, మహా మంగళహారతి కార్యక్రమాలను చూపరులను ఆకట్టుకునేలా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.